ప్రవేశిక

(1 నుండి 725వ పద్యం వరకు)

రసజ్ఞ పాఠకులకు అభివందనాలు. ఇప్పుడు మనం పోతన భాగవతం దశమస్కంధంలోకి ప్రవేశించాము. భాగవతంలోని అన్నిస్కంధాలూ ఒక ఎత్తు. దశమ స్కంధం ఒక ఎత్తు. దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని దివ్యమంగళ లీలా విలాసాలన్నీ సమగ్రంగా సర్వాంగ సుందరంగా ఈ దశమస్కంధంలోనే అభివర్ణితము లైనాయి. ఇందువల్లనే "శ్రీకృష్ణ సర్వస్వ"మైన భాగవత దశమ స్కంధానికి ఎక్కడలేని ప్రాశస్త్యం, ప్రాముఖ్యం ప్రాప్తించాయి.

శ్రీమన్నారాయణుని దశావతారములు ఈ క్రింది శ్లోకంలో పేర్కొనబడ్డాయి.

మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహశ్చ వామనః।
రామో రామశ్చ రామశ్చ బుద్ధః కలికి రేవ చ ॥

ఇందులో కృష్ణావతారం చెప్పబడలేదు. దానికి కారణం శ్రీకృష్ణుడు త్రిమూర్తులకు అతీతుడైన వాడనీ, గోలోకవాసియనీ, పరబ్రహ్మ స్వరూపుడనీ, ఆయనే ఈ అవతారాలన్నీ ధరించాడనీ పెద్దల అభిప్రాయం.

గీత గోవిందకర్త జయదేవ మహాకవి ప్రారంభ శ్లోకంలోనే ఇలా వ్రాశాడు.

వేదా నుద్ధరతే గిరిం కలయతే భూ చక్ర ముద్బిభ్రతే
దైత్యం దారయతే బలిం ఛలయతే క్షత్రక్షయం కుర్వతే ।
అబ్ధిం లంఘయతే హలం కలయతే కారుణ్య మాతన్వతే
మ్లేచ్ఛాన్ మూర్ఛయతే దశాకృతిభృతే కృష్ణాయ తుభ్యం నమః ॥

ఈ శ్లోకములో కూడా దేవదేవుడైన శ్రీకృష్ణుడే దశావతారములు ధరించాడని శ్రీ కృష్ణుణ్ణే దశావతారములకు అతీతుడుగా, శ్రీమన్నారాయణ స్వరూపుడుగా అభివర్ణించాడు జయదేవుడు. కృష్ణావతార స్థానంలో "హలం కలయతే"అని బలరాముణ్ణి చెప్పటం గమనించదగ్గ విషయం.

అమరసింహుడు కూడా తన **"నామలింగానుశాసనం"**లో **"విష్ణుర్నారాయణః కృష్ణో వైకుంఠో విష్టరశ్రవాః "** అని విష్ణుదేవుని పర్యాయపదాల్లో కృష్ణశబ్దం చేర్చాడు. బ్రహ్మవైవర్త పురాణం శ్రీకృష్ణుని పరబ్రహ్మ స్వరూపాన్ని నిరూపిస్తున్నది. అందువల్ల విష్ణుదేవుని అవతారాలలో సర్వశ్రేష్ఠమైనదీ, సర్వాంగ సుందరమైనదీ, పరిపూర్ణమైనదీ, దివ్యతేజో విరాజితమైనదీ కృష్ణావతారమని చెప్పవచ్చు.

మహేశ్వర ధ్యానతత్పరుడై అర్ధనిమీలిత నేత్రుడైన పోతన్న గారికి శ్రీరాముడు సాక్షాత్కరించి **"మన్నామాంకితంబుగా భాగవతంబు తెనుంగు సేయుము"**అని అనుశాసించినప్పటికీ పోతన్నగారు అంకితం పద్యాలు (షష్ఠ్యంతములు) **"హరికి నందగోకుల విహారికి"** ఇత్యాదిగా శ్రీకృష్ణునిపేర రచించటంలో బమ్మెర వారికి కల కృష్ణప్రీతి అభివ్యక్త మవుతున్నది. అందుకనే పోతన్నగారు భాగవతానికి శ్రీకారం చుట్టుతూ ఈ క్రింది పద్యంలో **"మహానందాంగనా డింభకుణ్ణి"** స్మరించి నమస్కరించాడు.

శ్రీ కైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోక ర
క్షైకారంభకు భక్తపాలన కళా సంరంభకున్ దాన వో
ద్రేక స్తంభకుఁ గేళిలోల విలస ద్దృగ్జాల సంభూత నా
నా కంజాతభవాండ కుంభకు మహా నందాంగనా డింభకున్. **1-1**

ఈ పద్య ప్రసూనంలోని ఆరుదళాలూ ఆయా స్కంధాల్లోని ఆయా కథలను సూచిస్తున్నాయని ఇంతకు ముందే ప్రథమస్కంధంలో ప్రస్తావించి ఉన్నాను. పై పద్యంలోని ఆరవదళమైన "మహానందాంగనా డింభకున్'' అన్నది దశమస్కంధాన్నీ, అందలి శ్రీకృష్ణలీలా విశేషాలనూ అభివ్యక్తం చేస్తున్నది. ఆనంద స్వరూపిణి అయిన ఆ నంద గోపుని ఇల్లాలు యశోదమ్మ ఒడిలో అల్లారు ముద్దుగా ఆడుకుంటున్న నల్లనయ్యను ధ్యానిస్తున్నా నన్నాడు పోతన్నగారు. ఆ యశోదా కిశోరుడు సామాన్యుడు కాడు. ఏ మాత్రం ఏమరుపాటు లేకుండా ఎల్ల లోకాలనూ చల్లగా పరిపాలిస్తుంటాడు. ప్రపన్నులైన భక్తుల ప్రార్థనలను ఆలించి లాలిస్తూ ఉంటాడు. నిరంకుశులైన నిశాచరుల ఔద్ధత్యాన్ని నిర్మూలిస్తూ ఉంటాడు. అంతేకాదు. కన్నతల్లి ఒడిలో ఒయ్యారంగా కూర్చున్న ఆ చిన్నికన్నయ్య ఒక్కమాటు అలా కన్నెత్తి చూస్తే చాలు - ఎన్నెన్నో బ్రహ్మాండ భాండాలు ఆ చూపులో రూపులు దిద్దుకుంటాయిట!

శ్రీ కృష్ణసౌందర్యాన్ని సహృదయ హృదయంగమంగా సంస్కృతంలో మహాకవులు వర్ణించారు. శుభాకృతులైన ఆ కృతులలో జయదేవుని "గీత గోవిందం'', లీలాశుకుని "శ్రీకృష్ణ కర్ణామృతం'', నారాయణ తీర్థులవారి "శ్రీకృష్ణ లీలాతరంగిణి'' ప్రధానంగా చెప్పుకోదగ్గవి. ఇక తెలుగులో శ్రీకృష్ణుని లీలావిలాసాలను ఎఱ్ఱన మహాకవి తన హరివంశంలో సుమనో మనోజ్ఞంగా చిత్రించాడు. తరువాత బమ్మెర పోతన్నగారి భాగవత దశమస్కంధం కృష్ణావతార వైభవాన్ని అత్యంత హృదయంగమంగా, అద్వితీయంగా, అనన్య సామాన్యంగా అభివర్ణించింది. ఒక విధంగా చెప్పాలంటే దశమ స్కంధం "మహానందాంగనా డింభకుని లీలా సర్వస్వ"మని భావించవచ్చు. దేవకీ గర్భస్థుడైన భగవంతుని బ్రహ్మాది దేవతలు ఈ విధంగా ప్రార్థిస్తారు.

ముచ్చిరి యున్నది లోకము, నిచ్చలు కంసాది ఖలులు నిర్దయు లేఁచన్;
మచ్చికఁ గావఁగ వలయును, విచ్చేయుము తల్లికడుపు వెడలి ముకుందా! 10-10

ఆ తరువాత దేవదేవుని దేవకీదేవి ప్రసవించిన శుభ సందర్భంలో

పాడిరి గంధర్వోత్తము, లాడిరి రంభాది కాంత, లానందమునన్
గూడిరి సిద్ధులు, భయములు, వీడిరి చారణులు, మొరసె వేల్పుల భేరుల్. 10-107

అతి ప్రసన్నుడైన వెన్నుని కన్న దేవకి, పున్నమినాడు షోడశ కళాప్రపూర్ణుడైన చంద్రుని కన్న ప్రాగ్దిశవలె చెలువొందిన దంటారు పోతన్నగారు.

వసుదేవుడు దేవదేవుని ఆజ్ఞానుసారం చిన్నికృష్ణుణ్ణి గోకులంలో ఉన్న నందుని ఇల్లాలు యశోదమ్మ పక్కలో చేరుస్తాడు. యశోద కుమారుణ్ణి కన్నదన్న వార్త గోకులమంతా వ్యాపించింది. అప్పుడు వ్రేపల్లెలోని గోపకాంతలంతా ఎంతో సంతోషంతో చిన్ని కన్నయ్యను చూడటానికి వచ్చారట.

ఏమి నోము ఫలమొ ఇంత ప్రొద్దొక వార్త, వింటి మబలలార! వీను లలర;
మన యశోద చిన్ని మగవానిఁ గనె నఁట; చూచి వత్తమమ్మ! సుదతులార! 10-184

అనుకుంటూ యశోద ఇంటికి వస్తున్న వ్రజకాంతల ఉత్కంఠను పోతన్నగారు ఈవిధంగా వర్ణించారు.

వేడుకతోడఁ గ్రొమ్ముడులు వీడఁ గుచోపరిహారరేఖ ల
ల్లాడఁ గపోల పాలికల హాటక పత్రరుచుల్ వినోదనం
బాడఁ, బటాంచలంబు లసియాడఁగఁ జేరి యశోదయింటికిం
జేడియ లేఁగి చూచి రొగి, జిష్ణుని విష్ణునిఁ జిన్ని కృష్ణునిన్. 10-187

అలా వచ్చిన గోపాంగనలు తెచ్చిన కానుక లిచ్చి, చిన్ని పాపనికి తల అంటి, పసుపు పూసి, స్నానం చేయించారట. నీళ్లు చుట్టు తిప్పి, రక్షపెట్టి, తొట్టెలో ఉంచి జోలపాడారట.

జోజో కమలదళేక్షణ!, జోజో మృగరాజమధ్య! జోజో కృష్ణా!
జోజో పల్లవ కరపద!, జోజో పూర్ణేందువదన! జోజో యనుచున్. 10-190

గొల్ల యిల్లాండ్రు అలా జోల పాడుతూ ఊపుతూ ఉంటే దొంగనిద్దుర పోతున్న బాలకృష్ణుణ్ణి పోతన్నగారు ఈ విధంగా వర్ణించారు.

లోకములు నిదుర వోవఁగ, జోకొట్టుచు నిదురవోని సుభగుఁడు, రమణుల్
జోకొట్టి పాడ నిదురం, గైకొను క్రియ నూరకుండె, కనుదెఱవకయున్. 10-193

చిన్నారి నల్లనయ్యకు అప్పు డప్పుడే మాటలు వస్తున్నాయి. “అవ్వా అవ్వా” అంటున్నాడు. అక్కడ పోతన్నగారి కల్పనా శిల్పం ఈ క్రింది కందంలో అందంగా రూపొందింది. చిత్తగించండి -

అవ్వల నెఱుఁగక ముప్పుర, యవ్వల వెలుఁగొందు పరముఁ, డర్భకుఁడై యా
యవ్వలకు సంతసంబుగ, “అవ్వా అవ్వా” యనంగ నల్లన నేర్చెన్. 10-294

కొన్నాళ్ళకు చిన్ని కృష్ణుడు మెల్ల మెల్లగా అడుగులు వెయ్యటం సాగించాడు. ఇక్కడ పోతన్నగారి భావ చిత్రణం -

అడుగులు వే గలిగియు, రెం, డడుగులనే మన్ను మిన్ను నలమిన బాలుం,
డడుగిడ దొరకొనె, శాత్రవు, లడుగులు సడుగులును వదలి అడుగవనిఁ బడన్. 10-295

భగవంతుడు సహస్రశీర్షుడు. సహస్రాక్షుడు. సహస్రపాదుడు. వేయి అడుగులు గల ఆ స్వామి రెండడుగులతోనే భూమ్యాకాశాలు ఆక్రమించాడు. అటువంటి దేవదేవుడు బాలకృష్ణుడై నందుని ఇంట్లో అడుగులు వేయసాగాడు. ఆ బుడుతడు అలా అడుగులు వేస్తూ ఉంటే విరోధులైన నిశాచరులు అవయవ సంధులు వీడిపోయి “అడుగవని” అంటే పాతాళంలోకి పడిపోయారట. రెండడుగులతోనే మన్నూ మిన్నూ ఆక్రమించిన వేయిఅడుగులవాడు అడుగులు వేస్తుంటే ఎంత భయమో మరి!

పోతన్నగారు **"పరమేశ్వర కరుణా కలిత కవితా విచిత్రులు"** తండ్రీ, తల్లీ, అక్కగారూ శైవాచార సంపన్నులు. అందువల్లనే పోతన్నగారు అవకాశం వచ్చినపుడల్లా హరిహరుల అభేదాన్ని కావలెనని అభివర్ణిస్తూ ఉంటారు. గ్రంథారంభంలోనే **"చేతులారంగ శివుని పూజింపడేని, నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని"** అంటూ తన అద్వైత భావాన్ని వెల్లడించారు. ఇప్పుడు వ్రేపల్లెలో నందుల వారి గుమ్మం ముందు దుమ్ములో ఆడుకుంటున్న బాలకృష్ణుణ్ణి వర్ణించ బోతున్నారు. ఆ నీలకంఠుడికీ, ఈ బాల గోపాలుడికీ అభేదం చెప్పాలని ఆయన సంకల్పం. ఎలా కుదురుతుంది. ఒకరు తెల్లని వారు. మరొకరు నల్లనివారు. అందుకోసం బాలకృష్ణుడి ఒంటినిండా తెల్లనిదుమ్ము కొట్టుకున్నట్లు అందువల్ల నల్లనివాడు తెల్లనివాడుగా మారినట్లు పోతనగారు కల్పించారు. ఈ క్రింది పద్యంలో -

తనువున నంటిన ధరణీ పరాగంబు పూసిన నెఱభూతి పూఁత గాఁగ
ముందఱ వెలుఁగొందు ముక్తా లలామంబు తొగల సంగడికాని తునుక గాఁగ
ఫాలభాగంబుపైఁ బరఁగు కావిరిబొట్టు కామునిఁ గెల్చిన కన్ను గాఁగఁ
గంఠమాలికలోని ఘన నీల రత్నంబు కమనీయమగు మెడకప్పు గాఁగ
హారవల్లు లురగహారవల్లులు గాఁగ, బాలలీలఁ బ్రౌఢబాలకుండు
శివుని పగిది నొప్పె శివునికిఁ దనకును, వేఱులేమిఁ దెల్ప వెలయునట్లు....... 10-297

బాలకృష్ణుడికి ఆ భావం ఉందో లేదో కాని శివుడికీ, కృష్ణుడికీ భేదం లేదని తెల్పాలనే ఉత్సాహం, ఉత్కంఠ సహజ పాండిత్యులవారికి ఉన్నదనటంలో సందేహం లేదు.

గోపకాంత లందరూ వచ్చి శ్రీకృష్ణుని దుడుకు చేష్టలు యశోదమ్మతో చెప్తుతున్నప్పుడు ఏమీ ఎరుగని అమాయకుని వలె తల్లి ఒడిలో తలజేర్చి కూర్చున్న బాలగోపాలుని వాలకాన్ని ఈ పద్యంలో మన కనులకు కట్టించారు పోతనగారు.

కాంతలు తల్లితోఁ దన వికారము లెల్ల గణింప భీతుఁడై
శాంతుని సొంపునం, బరమ సాధుని పెంపున, గోలమాడ్కి, వి
భ్రాంతుని కై వడిన్, జడుని భంగిఁ, గుమారకుఁ డూరకుండె నే
వింతయు లేక తల్లి కుచ వేదిక నొదల మోపి యాడుచున్. 10-334

తన బిడ్డపై నేరాలు మోపిన గోపికలను బుజ్జగించి పంపడంలో యశోద మాటనేర్పు చిత్తగించండి-

అన్య మెఱుగఁడు తనయంత నాడుచుండు, మంచివాఁ డీతఁ డెగ్గులు మానరమ్మ!
రామలార! త్రిలోకాభిరామలార! తల్లులార! గుణవతీమతల్లులార! 10-332

పెరుగు తరుస్తున్న యశోదమ్మ సహజ స్వరూపాన్ని పోతన్నగారు ఎంత చక్కగా వర్ణించాడో చూడండి-

కరకమలారుణకాంతి గవ్వఁపుఁద్రాడు పవడంపు నునుఁదీవ పగిది మెఱయఁ
గ్రమముతో రజ్జు నాకర్షింపఁ బాలిండ్లు వీడ్వడి యొండొంటి వీఁక నొత్తఁ

గుచకుంభముల మీఁది కొంగు జాఱఁగఁ జిక్కువడుచు హారావళి బయలుపడఁగఁ
బొడమిన చెమటతోఁ బొల్పారు నెమ్మోము మంచుపైఁ బడిన పద్మంబుఁ దెగడఁ
గౌను గునియంగఁ గంకణక్వణన మెసఁగఁ,దుఱుము బిగివీడఁ గర్ణికాద్యుతులు మెఱయ
బాలు నంకించి పాడుచుఁ బాటఁబాట, తరువు లిగురొత్త పెరుఁగింతి దరువఁ జొచ్చె. 10-355

దధిభాండాన్ని బద్దలు చేసిన తుంటరి కృష్ణుణ్ణి వెంట నంటి దండించాలని బెత్తం పట్టుకొని పరుగెత్తుతున్న యశోదను చూచి భయంతో పారిపోతున్న వెన్నదొంగ స్వరూపాన్ని పోతన్నగారు ఈ సీసంలో పోతపోశారు.

స్తంభాదికంబులు తనకు నడ్డంబైన నిట్టట్టు సని పట్టనీని వాని
ఈ తప్పు సైరింపు మింక దొంగిలఁ బోవ నే నని మునుముట్ట నేడ్చువానిఁ
గాటుక నెఱయంగఁ గన్నీరు నులుముచు వెడలు కన్నీటితో వెగచు వాని
ఏ దెస వచ్చునో యిది యని పలుమాఱు సురుగుచుఁ గ్రేగంటఁ జూచువానిఁ
గూడుఁ బాఱి పట్టుకొని వెఱపించుచుఁ, జిన్ని వెన్నదొంగ చిక్కె ననుచు
నలిగి కొట్టఁ జేతులాడక పూఁబోఁడి, కరుణతోడ బాలుఁ గట్టఁదలఁచి. 10-372

అల్లరి కృష్ణుణ్ణి పట్టుకొని బంధింపబోతూ యశోద ఇలా అంటుంది -

వీరెవ్వరు శ్రీకృష్ణులు, గారా! ఎన్నడును వెన్నఁ గానరఁట గదా!
చోరత్వం బించుకయును, నేర రఁట! ధరిత్రి నిట్టి నియతులు గలరే! 10-374

ఇలా ఎత్తి పొడుస్తూ బాలకృష్ణుణ్ణి రోటికి కట్టివేస్తుంది యశోద. అక్కడ ఒక చక్కని కందం వ్రాశారు పోతన్నగారు.

చిక్కఁడు సిరికౌఁగిటిలోఁ, జిక్కఁడు సనకాది యోగిచిత్తాబ్జములన్
జిక్కఁడు శ్రుతి లతికావళిఁ, జిక్కె నతఁడు లీలఁ దల్లిచేతన్ ఱోలన్. 10-383

బాలగోపాలుడు గోపాలబాలురతో కలిసి క్రేపులను కాయటం పోతన్నగారు చాలా హృదయంగమంగా వర్ణించారు. అందులోనూ గొల్లపిల్లలతోకూడి చల్దు లారగించటం కన్నులకు కట్టేటట్లు చిత్రించారు.

మాటిమాటికి వ్రేలు మడిచి యూరించుచు నూరుఁగాయలు దినుచుండు నొక్కఁ;
డొకని కంచములోని దొడిసి చయ్యన మ్రింగి చూడు లేదని నోరు చూపు నొక్కఁ;
డేగు రార్గురిచల్దు లెలమిఁ బన్నిదమాడి కూర్కొని కూర్కొని కుడుచు నొక్కఁ;
డిన్నియుఁ దగఁబంచి యిడుట నెచ్చెలితన మనుచు బంతెనగుండులాడు నొకఁడు;
కృష్ణుఁ జూడు మనుచుఁ గికురించి పరుమ్రోల, మేలి భక్ష్యరాశి మెసఁగు నొకఁడు;
నవ్వు నొకఁడు; సఖుల నవ్వించు నొక్కఁడు; ముచ్చటాడు నొకఁడు; మురియు నొకఁడు.10-496

సంగడీల నడుమ చక్కగా కూర్చుండి ఛలోక్తులు విసురుతూ యాగభోక్త అయిన భగవానుడు బాలకృష్ణుడై చల్దిముద్దలు తినటం ఎంత అద్భుతమైన విషయం! అటువంటి దేవాదిదేవునితో కలసి కూర్చుండి ఆడుతూ పాడుతూ చల్దులు ఆరగిస్తున్న గోపబాలకులు ఎంత అదృష్టవంతులో అంటారు పోతన్నగారు.

ఎన్నఁడునైన యోగివిభు లెవ్వని పాదపరాగ మింతయున్
గన్నులఁగాన; రట్టి హరిఁ గౌఁగిటఁ జేర్చుచుఁ జెట్టఁబట్టుచున్
దన్నుచు గ్రుద్దుచున్ నగుచుఁ దద్దయుఁ బైపడి కూడియాడుచున్
మన్ననసేయు వల్లవ కుమారుల భాగ్యము లింత యొప్పునే! 10-461

ఇదే సందర్భంలో బాలకృష్ణుని ప్రభావాన్ని పరీక్షింపబోయి ఓటువడిన బ్రహ్మదేవుడు ఈ విధంగా పలుకుతాడు కృష్ణునితో.

ఏలా బ్రహ్మపదంబు? వేదములకు న్వీక్షింపఁగా రాని ని
న్నీ లోకంబున నీ వనాంతరమునం దీ మందలోఁ గృష్ణ యం
చాలాపాది సమస్త భావములు నీ యందే సమర్పించు నీ
వ్రేలం దొక్కని పాదరేణువులు పై వేష్టించినం జాలదే! 10-572

తిరుమల తిరుపతి దేవస్థానంవారు బమ్మెరపోతన్నగారి భాగవతాన్ని ప్రతిపద్య భావార్థసహితంగా ప్రకటించాలని సంకల్పించటం ఆంధ్రులందరికీ ఆనందకరమైన విషయం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అనువాదభాగా లన్నింటినీ పరిశీలించి పరిష్కరించి ఏక సూత్రత కల్పించే కార్యం నాకు అప్పగించినందుకు టి.టి.డి. కార్య నిర్వహణాధికారి శ్రీ ఎం. వి. ఎస్. ప్రసాద్, ఐ. ఏ.యస్ గారికీ, ఎడిటర్ శ్రీ కె. సుబ్బారావు, ఎం. ఏ., గారికీ, డాక్టర్. రావుల సూర్యనారాయణ మూర్తి, పి. ఆర్. ఓ. గారికీ నా సాధు వాదాలు.

పోతన్నగారు రచించిన ఈ భాగవత దశమస్కంధం 3 వేల పద్యాలకు పై చిలుకుగా ఉన్నది. ఈ దశమస్కంధ పూర్వభాగంలో 1 నుండి 725వ పద్యం వరకు సరళ గద్యంలో అనువదించినవారు డాక్టర్. ఎక్కిరాల కృష్ణమాచార్యులవారు. ఎక్కిరాలవారు సంస్కృతాంధ్రములలో అందెవేసిన చేయి. ప్రముఖ కవి, ఆధ్యాత్మిక తత్త్వవేత్త. విశేషించి శ్రీకృష్ణభక్తిరస పరిపూర్ణములైన అనేక కృతులు వెలువరించినవారు. వీరి అనువాదం సర్వాంగసుందరమై, సరళమై, సహృదయ హృదయాహ్లాదాన్ని సంపాదించుకున్నది.

ఈ సంపుటాన్ని ముచ్చటగా ముద్రించి ఇచ్చిన దేవస్థానం ప్రెస్ మేనేజర్ శ్రీ ఎం. విజయకుమార్ రెడ్డిగారికి, వారి సిబ్బందికి నా శుభాకాంక్షలు. అక్షరదోషాలు దొర్లకుండా సహస్రాక్షులై ప్రూఫులు సరిదిద్దిన పూజ్య మిత్రులు, మహాకవులు శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులవారికి నా ధన్యవాదాలు. ముద్రణకు తగినట్లు ప్రెస్ కాపీ సిద్ధంచేసి ఇచ్చిన చిరంజీవి కోరాడ రామకృష్ణ, ఎం.ఏ., ఎం.ఫిల్., కు నా ఆశీర్వాదాలు.

భవదీయుడు

గుంటూరు,
ప్రమోద-శ్రావణము

కరుణశ్రీ
ప్రధాన సంపాదకుడు
పోతన భాగవతము

ప్రవేశిక

(726నుండి - 1791వ పద్యం వరకు)

'భాగవతం భాగవతం' అని పదిమార్లు అంటే చాలు మనమంతా బా గవతాం' అన్నాట్ట వెనకటికి ఒక పెద్దాయన. అంటే చదువుకున్న పండితులలోనే కాకుండా చదువురాని సామాన్యప్రజలలో కూడా భాగవతం అంటే ఎంతటి గౌరవం ఉన్నదో మనం ఊహించుకోవచ్చు.

అంతేకాదు. అష్టాదశ మహాపురాణాలలో కూడా శ్రీమద్భాగవతానికి ఒక విశిష్టస్థానం ఉన్నది. శ్రీమన్నారాయణుని ఏకవింశతి అవతారాలూ భాగవతంలో అభివర్ణింపబడినాయి. అంతేకాకుండా విశేషించి శ్రీకృష్ణావతారం సమగ్రంగా సర్వాంగసుందరంగా సహృదయ హృదయంగమంగా చిత్రీకృతమైంది.

భగవంతుని లీలలతోనూ, భగవద్భక్తుల చరిత్రలతోనూ నిండి భక్తి జ్ఞానవైరాగ్య సంభరితమై ఉండటం కూడా భాగవతానికి ఎక్కడలేని ప్రశస్తి తెచ్చిపెట్టింది. అందుకనే అది శ్రీమద్భాగవతంగా విరాజిల్లింది.

ఇంకా చెప్పాలంటే తక్కిన పురాణాల్లోకంటే భాగవతంలో వ్యాసులవారి రచన రమ్యమై ప్రౌఢగంభీరమై విలసిల్లింది.

పద్మపురాణంలో శ్రీమద్భాగవతం సాక్షాత్తుగా భగవత్స్వరూపమని నిరూపింపబడింది.

తమాదిదేవం కరుణానిధానం, తమాలవర్ణం సుహితావతారమ్ ।
అపారసంసార సముద్రసేతుం, భజమహే భాగవతస్వరూపమ్ ॥

భాగవతం భగవంతుని స్వరూపంగా చెప్పటం గమనించదగింది. భాగవతంలో ఉన్న పండ్రెండు స్కంధాలనూ భగవంతుని అవయవములుగా పేర్కొనడం జరిగింది. చిత్తగించండి-

ప్రథమశ్చ ద్వితీయశ్చ చరణౌ ద్వౌ ప్రకీర్తితౌ ।
తృతీయశ్చ చతుర్థశ్చ ద్వావూరూ సముదీరితౌ ॥
పంచమో నాభిదేశశ్చ షష్ఠో హృదయ ముచ్యతే ।
సప్తమ శ్చాష్టమశ్చైవ బాహూ ద్వౌ పరికీర్తితౌ ॥
నవమః కంఠదేశః స్యాత్ దశమో ముఖమేవ చ ।
ఏకాదశో లలాటం చ ద్వాదశస్తు శిఖోచ్యతే ।
ఏవం సర్వం భాగవతం శ్రీహరేరంగ ముచ్యతే ॥

భాగవతంలోని ప్రథమ ద్వితీయస్కంధాలు భగవంతుని చరణాలనీ, తృతీయ చతుర్థస్కంధాలు ఊరువులనీ, పంచమ స్కంధం నాభిప్రదేశమనీ, షష్ఠస్కంధం హృదయమనీ, సప్తమ అష్టమస్కంధాలు బాహువులనీ,

నవమస్కంధం కంఠమనీ, దశమస్కంధం ముఖమనీ, ఏకాదశం లలాటమనీ, ద్వాదశం శిఖ అనీ వివరింపబడింది. ఇందులో దశమస్కంధం భగవంతుని ముఖమనీ చెప్పడంవల్ల దాని ప్రాధాన్యం ఎంతటిదో అభివ్యక్త మవుతున్నది.

దశావతారాలలో శ్రీకృష్ణావతారానికి ఒక ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లే భాగవతంలోని పన్నెండు స్కంధాలలోను దశమస్కంధానికి ఒక విశిష్టస్థానం ఉన్నది. సమగ్రంగా సర్వాంగసుందరంగా శ్రీకృష్ణచరిత్రం అభివర్ణింపబడిన దశమస్కంధం "శ్రీకృష్ణ లీలాసర్వస్వం" అనటంలో అతిశయోక్తి అణుమాత్రం లేదు.

"శ్రీ కైవల్యపదంబు చేరుటకునై చింతించెదన్" అంటూ పోతన్న గారు భాగవత ప్రారంభంలో సంస్మరించిన **"మహానందాంగనాడింభకుని"** లీలావిలాసాలన్నీ ఈ దశమ స్కంధంలోనే చోటు చేసుకున్నాయి.

"శ్రీకంఠ చాపఖండన! పాకారిప్రముఖ వినుత భండన! విలసత్
కాకుత్స్థవంశ మండన! రాకేందు యశోవిశాల! రామనృపాలా!"

బాల బాలికలకు బాగా పరిచయమైన ఈ పద్యం దశమస్కంధారంభంలోనిదే.

వరాహావతారం తృతీయ స్కంధంలోను, నరసింహావతారం సప్తమ స్కంధంలోనూ, మత్స్య కూర్మ వామనావతారాలు అష్టమస్కంధంలోను, పరశురామ శ్రీరామావతారాలు నవమస్కంధంలోను అభివర్ణితాలు కాగా శ్రీకృష్ణావతారానికి దశమస్కంధం సంపూర్ణంగా, సర్వతో ముఖంగా ప్రాతినిధ్యం వహిస్తున్నది.

ఆంధ్రదేశంలో ఆబాల గోపాలానికీ అత్యంతం అభిమాన పాత్రాలైన-

"నల్లనివాడు పద్మనయనంబులవాడు....."
"ఓయమ్మ! నీ కుమారుఁడు మా యిండ్లను పాలు పెరుగు....."
"నీ పాదకమల సేవయు నీ పాదార్చకులతోడి నెయ్యము....."
"ఏమి నోము ఫలమొ ఇంత ప్రొద్దొకవార్త....."
"తనువున నంటిన ధరణీ పరాగంబు....."
"అమ్మా! మన్ను దినంగ నే శిశువనో ఆఁకొంటినో!....."
"చిక్కఁడు సిరి కౌఁగిటిలో....."
"వీరెవ్వరు శ్రీకృష్ణులు గారా?...."
"కలయో! వైష్ణవమాయయో! ఇతర సంకల్పార్థమో!....."
"బాలుం డీతఁడు కొండ దొడ్డది మహాభారంబు....."
"మామా వలువలు ముట్టకు మామా! కొనిపోకు పోకు....."

"ఇంతుల్ తోయము లాడచుండ మగవా రేతెంతురే!....."

"శ్రీయుతమూర్తి! యో పురుషసింహమ!....."

"ఘనుఁ డా భూసురుఁ డేగెనో! నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో!....."

"లగ్నం బెల్లి వివాహముం గదిసె....."

"ఆ యెలనాగ నీకుఁ దగు అంగనకున్ దగుదీవు....."

"లేమా! దనుజుల గెలువఁగ లేమా?....."

"ఊరకరారు మహాత్ములు....."

"వీఁడటే రక్కసి విగతజీవగ....."

ఇత్యాది పద్యరత్నాలన్నీ ఈ మంజుల మంజూషలోనివే.

భాగవతంలోని పన్నెండు స్కంధాలలో దశమస్కంధం చాలా పెద్దది. ఇందులో సుమారు 3140 గద్య పద్యాలు ఉన్నాయి.

ఈ సంపుటంలో శ్రీకృష్ణజననం, పూతనాహరణం, శకటాసుర భంజనం, తృణావర్తనిరాసనం, బలరామకృష్ణుల బాల్యక్రీడలు, మృద్భక్షణం, విశ్వరూప సందర్శనం, ఉలూఖలబంధనం, యమళార్జున భంజనం, బృందావనాగమనం, వత్సాసుర బకాసుర వధ, చల్ది భోజనములు, బ్రహ్మదేవుని పరీక్ష, ధేనుకాసుర సంహారం, కాళియ మర్దనం మొదలైన కథలు మీరు చదివే ఉన్నారు.

ఇప్పుడు మీరు ప్రలంబాసుర వధ, దావాగ్ని దమనం, గోపికావస్త్రాపహరణం, గోవర్ధనోద్ధరణం, శరద్రాత్రిలో వేణుగానం, గోపికాగీతలు, రాసక్రీడలు, కేశివ్యోమాసుర సంహారం, అక్రూరాగమనం, మథురా నగర ప్రవేశం, రజక గర్వభంజనం, సుదాముని వృత్తాంతం. కువలయాపీడ మర్దనం, చాణూర ముష్టికవధ, కంససంహారం, దేవకీ వసుదేవుల కారాగృహ విమోచనం, ఉగ్రసేనుని పట్టాభిషేకం, రామకృష్ణుల విద్యాభ్యాసం, భ్రమరగీతలు, జరాసంధ దురాక్రమణం, కాలయవన సంహారం, ముచుకుందుని వృత్తాంతం, రుక్మిణీ కల్యాణం- అనే కథాఘట్టాలు సుమనోమనోజ్ఞంగా అభివర్ణితమైనాయి.

దావాగ్ని చుట్టుముట్టిన వ్రజవాసులు శ్రీకృష్ణుణ్ణి ఇలా ప్రార్థిస్తారు.

నీ చుట్టాలకు నాపదల్ గలుగునే నే మెల్ల నీవార, మ
న్యాచారంబు లెఱుంగ మీశుఁడవు మా; కాభీలదావాగ్ని నేఁ
డే చందంబున నింక దాఁటుదుము? మ మ్మీక్షించి రక్షింప వ
న్నా! చంద్రాభ! విపన్నులన్ శిఖివితానచ్ఛన్నులన్ ఖిన్నులన్. 10-745

కోకలు కొనిపోతున్న కొంటెగోపాలుని గోపికలు వేడుకుంటున్నారు.

మామా వలువలు ముట్టకు, మామా కొనిపోకు పోకు మన్నింపు తగన్
మా మాన మేల కొనియెదు, మా మానసహరణ మేల మానుము కృష్ణా! 10-820

కట్టుబట్టలు అపహరించి చెట్టెక్కి కూర్చున్న నల్లనయ్యతో వల్లవాంగనలు ఇలా అంటారు-

ఇంతుల్ తోయము లాడుచుండ మగవా రేతెంతురే! వచ్చిరా
యింతల్ సేయుదురే కృపారహితులై యేలోక మందైన; నీ
వింతల్ నీతలఁ బుట్టఁగాక మఱియే వీ కృష్ణ! యో చెల్ల! నీ
చెంతన్ దాసులమై చరించెదము మా చేలంబు లిప్పింపవే! 10-829

ఇక్కడ "ఇంతల్ సేయుదురే'' అన్నదానిలో ఎంత కవిత్వం ఉన్నదో!

గోవర్ధనపర్వతాన్ని గొడుగుగా పై కెత్తి పట్టిన గోపాల కృష్ణుడు గోప గోపీజనులను భయపడవద్దని హెచ్చరిస్తూ ఇలా పలుకుతాడు.

బాలుం డీతఁడు కొండ దొడ్డది మహా భారంబు సైరింపఁగాఁ
జాలండో యని దీనిక్రింద నిలువన్ శంకింపఁగాఁ బోల; దీ
శైలాంభోనిధి జంతు సంయుత ధరా చక్రంబు పైఁబడ్డ నా
కే లల్లాడదు బంధులార! నిలుఁ డీ క్రిందన్ బ్రమోదంబునన్. 10-917

బృందావనంలో అంతర్హితుడైన నందనందనుణ్ణి అన్వేషిస్తున్న వ్రజసుందరుల ఆందోళన, ఆవేదన-ఈక్రింది పద్యాలలో సందర్శించవచ్చు-

"పున్నాగ! కానవే పున్నాగ వందితు తిలకంబ! కానవే తిలకనిటలు
ఘనసార! కానవే ఘనసారశోభితు బంధూక! కానవే బంధుమిత్రు
మన్మథ! కానవే మన్మథాకారుని వంశంబ! కానవే వంశధరుని
చందన! కానవే చందనశీతలు కుందంబ! కానవే కుందరదను......." 10-1009

"అదె నందనందనుం డంతర్హితుం డయ్యెఁ బాటలీతరులార! పట్టరమ్మ!
హేలావతుల కృష్ణ! యేల పాసితి వని యైలేయలతలార! యడుగ రమ్మ!
వనజాక్షుఁ డిచటికి వచ్చి దాగఁడు గదా చూతమంజరులార! చూడరమ్మ!
మానినీమదనుతో మా రాక యెఱిఁగించి మాధవీలతలార! మనుప రమ్మ!....." 10-1014

"హరిచరణములకుఁ బ్రియవై, హరి నిను మన్నింప భద్ర మందెదు తులసీ!
హరి నీ దెసరాఁడు గదా, హరిచొ ప్పెఱిఁగించి శుభము లందింపఁగదే!" 10-1015

ఇదే సందర్భంలో కలువపూల సుగంధాలు వెలువరించుచున్న రెండు పద్యాలు-

నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు కృపారసంబు పైఁ
జల్లెడు వాఁడు మౌళిపరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రా
జిల్లెడు మోమువాఁ డొకఁడు చెల్వల మానధనంబుఁ దెచ్చె నో
మల్లియలార! మీ పొదల మాటున లేఁడు గదమ్మ! చెప్పరే! 10-1011

అంగజునైనఁ జూడ హృదయంగముఁడై కరఁగించువాఁడు శ్రీ
రంగదురంబువాఁడు మధురంబగు వేణురవంబువాఁడు మ
మ్మంగజు పువ్వుఁదూపులకు నగ్గము చేసి లవంగ లుంగ నా
రంగములార! మీకడకు రాఁడు గదా! కృప నున్నఁ జూపరే! 10-1012

ఈ విధంగా చెట్టు చెట్టునూ ప్రశ్నిస్తూ యదుకులతిలకుని వెదకుతున్న గోపికలకు "హల కులిశ కలశాంకుశాది శుభలక్షణ లక్షితము"లైన కృష్ణుని పదచిహ్నాలు కన్పిస్తాయి. గోపాంగనలు గోపాలదేవుని చరణాలు గుర్తించారు. ఈ చరణాల గుర్తింపులో సహజ పాండిత్యుని సహజపాండిత్యాన్ని మనం గుర్తిస్తాము-

ఒక యెలనాఁగ చేయూఁదినాఁ డిక్కడ సరస నున్నవి నాల్గు చరణములును
ఒక నీలవేణితో నొదిగినాఁ డిక్కడ మగజాడలో నిదె మగువజాడ
ఒక లేమ మ్రొక్కిన నొడిసినాఁ డిక్కడ రమణి మ్రొక్కిన చొప్పు రమ్య మయ్యె
ఒక యింతి కెదురుగా నొలసినాఁ డిక్కడ నన్యోన్యముఖములై యంఘ్రు లొప్పె

ఒకతె వెంటఁదగుల నుండక యేగినాఁ, డడుగు మీఁదఁ దరుణి యడుగు లమరె
అబల లిరుగెలంకులందు రాఁ దిరిగినాఁ, డాఱుపదము లున్న వమ్మ యిచట!! **10-1029**

ఇచ్చటి "గోపికాగీత" లలో గోపసుందరుల సుకుమారహృదయం గోచరిస్తుంది-

నీ వడవిం బగల్ దిరుగ నీకుటిలాలక లాలితాస్య మి
చ్ఛావిధిఁ జూడకున్న నిమిషంబులు మాకు యుగంబులై చనున్
గావున రాత్రులైన నినుఁ గన్నుల నెప్పుడుఁ జూడకుండ ల
క్ష్మీవర! ఱెప్ప లడ్డముగఁ జేసె నిదేల విధాత క్రూరుఁడై? **10-1051**

ఒక శరద్రాత్రి చల్లనివేళ తెల్లని వెన్నెలలో నల్లనయ్య పిల్లన గ్రోవిమీద బ్రహ్మ గాంధర్వ గీతాన్ని ప్రసరింప జేశాడు. ఆ మురళీధరుని మోహనమూర్తిని దర్శించండి-

కర్ణావతంసిత కర్ణికారప్రభ గండభాగద్యుతి గడలుకొనఁగ
భువనమోహనమైన భ్రూవిలాసంబుతో వామభాగానతవదన మొప్ప

అపసవ్యకర మృదులాంగుళీచాతురి షడ్జధ్వనికి మర్మసరణిఁ జూప
డాకాలిమీఁద నడ్డము సాఁచి నిల్పిన పదనఖద్యుతి భూమిఁ బ్రబ్బికొనఁగ

మౌళిపింఛము కంఠదామమున మెఱయ, విలసితగ్రామముగ నొక్క వేణువందు
బ్రహ్మగాంధర్వగీతంబు పరఁగఁజేసెఁ, జతురనటమూర్తి గోపాలచక్రవర్తి. 10-769

వేణుగానం వీనుల సోకగానే వ్రేపల్లెలోని గోపికలందరూ బృందావనానికి పరువెత్తుకొని వచ్చారు. వంశీధరుని గానమాధుర్యానికి మైమరచారు. ఒక గోపిక యదుకుమారుని పెదవులక్రింద కదలుతున్న మురళి అదృష్టానికి అసూయపడి అంటుంది-

ఒనరన్ వ్రేతల కించుకేనియును లేకుండంగ గోపాల కృ
ష్ణుని కెమ్మోవి సుధారసంబుఁ గొనుచుం జోద్యంబుగా మ్రోయుచున్
దన పర్వంబులు నేత్రపర్వములుగా దర్పించెఁ బూర్వంబునన్
వనితా! యెట్టి తపంబుసేసె నొకొ యీ వంశంబు వంశంబులోన్. 10-779

ఇంకొక గోపిక తాను మురళిగా పుట్టి ఉంటే ఎంత బాగుండేది, అటువంటి అదృష్టం తనకు లభించ లేదని వాపోతుంది. క్రిందటి జన్మలో తన పొరపాటుకు బాధపడుతుంది-

నా మోసంబున కెద్దిమేర వినవే నా పూర్వజన్మంబునన్
లేమా! నోముల నోముచో నకట! కాళిందీ తటిన్ వేణువై
భూమిం బుట్టెద నంచుఁ గోరఁ దగదే; బోధిల్లి యట్లైన నీ
బామం దిప్పుడు మాధవాధర సుధా పానంబు గల్గుం గదే! 10-782

మరొక గోపిక వేణుగాన శ్రవణంతో పరవశించిన పక్షులను వీక్షించి పలుకుతుంది. ఈ సందర్భంలో వ్యాసభాగవతంలోని శ్లోక మిది-

ప్రాయో బతాంబ విహగా మునయో వనేఽస్మిన్
కృష్ణేక్షితం తదుదితం కలవేణుగీతమ్ ।
ఆరుహ్య యే ద్రుమభుజాన్ రుచిరప్రవాళాన్
శృణ్వంతి మీలితదృశో విగతాన్యవాచః ॥

పక్షులు పారవశ్యంలో కన్నులు మూసుకున్నాయన్న శ్లోకభావాన్ని తమ హృదయాలలో ఉన్న కృష్ణుని రూపం వెలుపలికి పోకుండా అడ్డుపెడుతున్నట్లు కనులు మూసుకున్నాయని పోతన్నగారు చమత్కరించారు-

జగతీజంబుల శాఖ లెక్కి మురళీ శబ్దామృతస్యందమున్
మిగులన్ వీనులఁ ద్రావి వ్రేగుపడి నెమ్మిం గృష్ణురూపంబు చి

త్తగమై యుండఁగ నడ్డపెట్టుక్రియ నేత్రంబుల్ దగన్ మూసి యీ
ఖగముల్ సొక్కెడిఁ జూచితే మునిజనాకారంబులన్ గామినీ! 10-790

శ్రీకృష్ణుని ముఖంలోనుంచి వెలువడుతున్న వేణుగాన సుధారసాన్ని ఆవులు నిక్కించిన చెవులతో త్రాగుతున్నాయనీ, ఆవుదూడలు పాలుత్రాగడం మాని ఆనందబాష్పాలతో ఆ నందనందనుణ్ణి సందర్శిస్తూ ఉన్నవనీ వ్యాసులవారు సంస్కృత భాగవతంలో ఇలా అభివర్ణించారు-

గావశ్చ కృష్ణముఖ నిర్గత వేణుగీత, పీయూష ముత్తభిత కర్ణపుటైః పిబంత్యః ।
శాబాః స్తనస్నుతపయః కబలాః స్మ తస్థుః, గోవింద మాత్మని దృశాశ్రుకలాః స్పృశంత్యః ॥

ఒకే శ్లోకంలో ఉన్న భావాన్ని పోతన్నగారు చక్కగా ప్రస్తరించి విస్తరించి రెండు పద్యాలలో సుమనో మనోజ్ఞంగా వర్ణించారు. ముందుగా ఆవుల ఆనంద తన్మయత్వం-

మమతన్ మోములు మీఁది కెత్తుకొని రోమంథంబు సాలించి హృ
త్కమలాగ్రంబులఁ గృష్ణు నిల్పి, మురళీ గానామృతశ్రేణి క
ర్ణములం గ్రోలుచు మేఁత మాని గళితానందాశ్రులై చిత్రితో
పమలై గోవులు చూచుచున్న వవిగో పద్మాక్షి! వీక్షించితే! 10-789

అనంతరం ఆవుదూడల సంతోష పారవశ్యం ఎంత హృదయంగమంగా చిత్రించారో చిత్తగించండి-

తల్లుల చన్నుఁబాలు మును ద్రావుతటిన్ దమకర్ణ వీథులన్
వల్లభమైన మాధవుని వంశరవామృతధార సొచ్చినన్
ద్రుళ్ళక పాలురాఁ దివక దూఁటక మానక కృష్ణుమీఁద దృ
గ్వల్లులు సేర్చి నిల్చె నదె వత్సము లంగనలార కంటిరే! 10-788

నెమరు వేయటం మాని చూస్తున్న గోవులూ, పాలుత్రాగటం మాని చూస్తున్న గోవత్సాలూ.....

కంసుని పంపున అక్రూరుడు బలరామకృష్ణులను తీసికొని పోవటానికి గోకులానికి వస్తాడు. పూర్వజన్మలో ఎంత పుణ్యం చేశానో ఇప్పుడు కృష్ణుణ్ణి దర్శించే భాగ్యం కలిగింది అనుకుంటాడు. దీని మూలశ్లోకం ఇది-

కిం మయాచరితం భద్రం కిం తప్తం పరమం తపః ।
కిం వాథాప్యర్హతే దత్తం యద్ద్రక్ష్యామ్యద్య కేశవమ్ ॥

దీనిని పోతన్నగారు "నా యట్టి వివేకహీనునకు" అని అక్రూరుని అల్పత్వాన్నీ "మహామునీంద్రుల యోగదృష్టికి సైతం పట్టువడని పరమేశ్వరుని" అని శ్రీకృష్ణుని మహత్వాన్నీ ఇలా అభివ్యక్తం చేశాడు-

ఎట్టి తపంబు సేయఁబడె నెట్టి చరిత్రము లబ్ధ మయ్యెనో
యెట్టి ధనంబు లర్థులకు నీఁబడెనో తొలిబామునందు నా
యట్టి వివేకహీనునకు నాదిమునీంద్రులు యోగదృష్టులం
బట్టఁగ లేని యీశ్వరుని బ్రహ్మమయున్ హరిఁ జూడఁ గల్గెడిన్. 10-1189

మధురనుంచి తన్ను తీసుకొని పోవటానికి వచ్చిన అక్రూరుణ్ణి గోపాలుడు కుశలప్రశ్న వేసిన తీరు మూలంలో ఇలా ఉన్నది-

తాత సౌమ్యాగతః కంసాత్ స్వాగతం భద్రమస్తు వః ।
అపి స్వజ్ఞాతి బంధూనా మనమీవ మనామయమ్? ॥

దీనికి పోతన్నగారు తెలుగు పూతపూసి ఎంత చక్కని పద్యం వ్రాశారో తిలకించండి-

శుభమే నీకుఁ? బ్రమోదమే సఖులకున్? జుట్టాలకున్ సేమమే?
యభయంబే ప్రజకెల్ల? గోత్రజుల కాత్మానందమే? మామ ము
క్త భయుండే? వసుదేవదేవకులు తత్ కారాగృహంబందు మత్
ప్రభవవ్యాజ నిబద్ధులై బ్రదికిరే ప్రాణానిలోపేతులై? 10-1206

కృష్ణుణ్ణి మధురకు తీసుకొనివెళ్ళటానికి అక్రూరుడు వచ్చాడని తెలుసుకున్న గోపికలు ఇటువంటి దుర్ఘటన ఘటింపజేసిన విధిని క్రూరుడని నిందిస్తారు మూలంలో-

క్రూర స్త్వమక్రూర సమాఖ్యయా స్మ న, శ్చక్షుర్హి దత్తం హరసే బతాజ్ఞవత్ ।
యేనైకదేశేఽఖిలసర్గ సౌష్ఠవం, త్వదీయ మద్రాక్ష్మ వయం మధుద్విషః ॥

పోతన్నగారి గోపికలు బ్రహ్మదేవుణ్ణి విడిచిపెట్టి అక్రూరుణ్ణి ఆడిపోసుకుంటారు. ఇతడు అక్రూరుడు కాడు, క్రూరు డంటారు. అందుకే ఇలా వచ్చాడు అంటారు.

అక్రూరుండని పేరు పెట్టుకొని నేఁ డస్మన్మనోవల్లభుం
జక్రిన్ మాకడఁ బాపికొంచు నరుగం జర్చించి యేతెంచి నాఁ
డక్రూరుం డట క్రూరుఁ డీతఁడు నిజం బక్రూరుఁడౌ నేని ని
ర్వక్రత్వంబున కృష్ణుఁ బెట్టి తన త్రోవం బో విచారింపఁడే. 10-1216

నిజంగా అక్రూరుడే అయితే కృష్ణుణ్ణిక వదలిపెట్టి వెళ్లాలి అనటం బాగుంది.

అక్రూరుడు రామకృష్ణులను రథం ఎక్కించుకొని మధురకు కొనిపోతున్నాడు. కృష్ణవియోగాన్ని సహించలేని గోపికలు గొంతెత్తి విలపించుతారు-

ఏవం బ్రువాణా విరహాతురా భృశం, వ్రజస్త్రియః కృష్ణవిషక్త మానసాః ।
విసృజ్య లజ్జాం రురుదుస్స్మ సుస్వరం, గోవింద దామోదర మాధవేతి ॥

వీరు సంస్కృత గోపికలు. ఇక తెలుగు గోపికలు ఎలా విలపించారో పోతన్నగారు ఈ క్రింది పద్యంలో చెప్పారు. "కపోలతట సంవిన్యస్త హస్తాబ్జలై", "పవనోద్ధూత లతాభలై" అనే రెండు విశేషణాలు అదనంగా జేర్చి గోపికల దయనీయ స్థితిని కనులకు కట్టించారు.

ఉవిదల్ సిగ్గులు మాని కన్గవల నీ రొండొండ వర్షింపఁగా
వివశత్వంబులతోఁ గపోలతట సంవిన్యస్తహస్తాబ్జలై
పవనోద్ధూత లతాభలై మముఁ గృపం బాలింపు గోవింద మా
ధవ దామోదర యంచు నేడ్చిరి సుజాతంబైన గీతంబులన్. 10-1221

అక్రూరుడు రామకృష్ణులను మథురకు తీసుకువెళ్తున్నాడు. రథం యమునా నదీతీరానికి చేరింది. రామకృష్ణులు రథం దిగి నదిలోనికి వెళ్లి నీళ్ల త్రాగి మళ్లీ రథంమీదకు వచ్చి కూర్చున్నారు. అక్రూరుడు నదిలో దిగి స్నానం చేస్తుండగా నదీజలాలలో శ్రీకృష్ణుడు కన్పించాడు. అలా చాలాసేపు చూచిచూచి చేతులు మోడ్చి నమస్కరించి ఒడ్డుకు వచ్చి చూస్తే కృష్ణుడు రథంమీద కూర్చుని ఉన్నాడు. ఆశ్చర్యచకితుడైన అక్రూరునితో కృష్ణుడంటాడు-

జలములు చేరువ నున్నవి;, తలపోయఁగ నీవు పోయి తడవయ్యె; నదీ
జలముల, నభమున ధరణిన్, గలుగని చోద్యములు నీకుఁ గానంబడెనే? 10-1237

శ్రీకృష్ణుని ప్రశ్నకు అక్రూరుడు ఏమని సమాధానం చెబుతాడు? భగవంతుడైన కృష్ణుని మహత్త్వానికి వెరగుపడి వినయ వినమిత శిరస్కుడై భక్తిరస పరిపూర్ణ మనస్కుడై ఇలా అంటాడు-

నీలోన లేని చోద్యము, లే లోకములందుఁ జెప్ప రీశ్వర! నీటన్
నేలన్ నింగిని నున్నవె, నీలోఁ జోద్యంబు లెల్ల నెగడు మహాత్మా! 10-1239

రథం మథురానగరంలో ప్రవేశిస్తుంది. శ్రీకృష్ణుడు మథురకు విచ్చేస్తున్నాడనే శుభవార్త విన్న పౌరకాంత లందరూ నందనందన సందర్శన కుతూహలాయత్తచిత్తలై గుములు కూడతారు. ఆ సంతోష వార్తను పరస్పరం ఈ విధంగా చెప్పుకుంటారు-

నందు తపఃఫలంబు, సుగుణంబుల పుంజము, గోపకామినీ
బృందము నోముపంట, సిరి విందు, దయాంబుధి, యోగిబృందముల్
డెందములందుఁ గోరెడి కడింది నిధానము, సేరవచ్చెనో
సుందరులార! రండు చని చూతము కన్నుల కోర్కి దీరఁగన్. 10-1247

ఈ విధంగా సంబరాలు పడుతూ మథురాపురం సుందరీమణు లందరూ తొందర తొందరగా నంద తనయుణ్ణి చూడటానికి మేడ లెక్కుతారు:

వీటఁగల చేడె లెల్లను, హాటకమణి ఘటిత తుంగ హర్మ్యాగ్రములన్
గూటువలు గొనుచుఁ జూచిరి, పాటించి విశాలవక్షు పద్మదళాక్షున్. 10-1240

విశాలవక్షుడైన ఆ పద్మదళాక్షుణ్ణి వీక్షిస్తూ ఉన్న హరిణేక్షణలను సహజపాండిత్యుడు ఇలా అభివర్ణించాడు-

"వీఁడఁటే రక్కసి విగతజీవగఁ జన్నుఁ బాలుద్రావిన మేటి బాలకుండు
వీఁడఁటే నందుని వెలఁదికి జగమెల్ల ముఖమందుఁ జూపిన ముద్దులాఁడు
వీఁడఁటే మందలో వెన్నలు దొంగిలి దర్పించి మెక్కిన దాఁపరీఁడు
వీఁడటే యెలయించి వ్రేతల మానంబు సూఱలాడిన లోకసుందరుండు....." 10-1250

ఈ విధంగా ఒకరి నొకరు తోసుకుంటూ చేతులు చాచి చూపిస్తూ ఆ నవనీతచోరుని భువనమోహన సౌందర్యానికి మురిసిపోతూ అనుకుంటారు.

చెలియా! గోపిక లీ కుమారతిలకుం జింతించుచుం బాడుచుం
గలయం బల్కుచు నంటుచున్ నగుచు నాకర్షించుచున్ హస్తగా
మలక క్రీడకుఁ దెచ్చి నిచ్చలును సమ్మానంబులం బొందఁగాఁ
దొలుజన్మంబుల నేమి నోఁచిరో కదే దుర్గప్రదేశంబులన్. 10-1251

శ్రీకృష్ణుడు మథురానగరంలో ఎదురుగా వస్తున్న రజకుణ్ణి చూచి ఇలా అంటాడు-

విందులమై నరేశ్వరుని వీటికి వచ్చితి మేము; మాకు మా
మందలలోన గట్టికొన మంచిపటంబులు లేవు; నీ ముడిన్
సుందరధౌతచేలములు శోభిలుచున్నవి; తెమ్ము; నిన్ను మే
లందెడు నిమ్ము, రాజుదెస నల్లుర మో రజకాన్వయాగ్రణీ! **10-1256**

అంత గొప్పగా సంబోధించి ప్రాధేయపడి శుభం పలికి ప్రార్థించినా అందుకు ఆ రజకుడు తలబిరుసుగా సమాధానం చెబుతాడు-

ఎట్టెట్రా! మనుజేంద్రు చేలములు మీ కీఁబాడియే? మీరలుం
గట్టం బోలుదురే? పయోఘృతదధిగ్రాసంబులన్ మత్తులై
యిట్టాడం జనెఁగాక గొల్లలకు మీ కెబ్బంగి నోరాడెడిన్?
కట్టా! ప్రాణము గోలుపోయెదు సుమీ కంసోద్ధతిన్ బాలకా! 10-1258

గర్వాంధుడైన రజకుడికి దేహశుద్ధి చేసి రామకృష్ణులు వస్త్రాలు ధరించి ముందుకు సాగుతారు. ఇంతలో సుదాముడనే మాలాకారుడు కనిపిస్తాడు. అతడిసేవలకు మెచ్చి వరం కోరుకోమంటాడు కృష్ణుడు. అప్పుడు సుదాముడు ఇలా అంటాడు-

నీ పాదకమలసేవయు, నీపాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపారభూత దయయును, తాపసమందార! నాకు దయసేయఁగదే! 10-1270

ఈ పద్యానికి తెలుగువారి నాలుకలపై ఎంతటి ప్రచారం అధికారం ఉన్నదో మన అందరికీ తెలుసు. ఇంతకూ ఆ పద్యం సుదాముడు పలికిందా? పోతనగారు పలికిందా? అనేదే సందేహం.

ఆ తరువాత కుబ్జ అనే మరుగుజ్జుపిల్ల కనిపిస్తుంది. ఆ వంకరటింకరపిల్లను చూచి కృష్ణు డిలా అంటాడు-

ఎవ్వరిదానవు? లేపము, లెవ్వరికిం గోరికొనుచు నేగెదు? నీ పే
రెవ్వతె? మా కిమ్మిన్నియు, నివ్వటిలెదు చక్కనగుచు నీరజనేత్రా! 10-1274

'చక్కనగుచు' అన్నమాటలోని వ్యంగ్యాన్ని కుబ్జ గ్రహించింది. ఆ అమ్మాయి కొంచెం రోషంతో ఇలా అంటుంది-

'చక్కనివాఁడవౌదు! సరసంబుల నొంపకు; మెల్లవారికిన్
జక్కదనంబు లెక్కడివి? 10-1276

'నీవే పెద్ద చక్కనయ్యవులే. చమత్కారాలు చాలించు. అందరికీ నీ చక్కదనం ఎక్కడనుంచి వస్తుంది? నా పేరు త్రివక్ర. కంసుడి దాసిని. రాజుగారికి సుగంధలేపనాలు తీసుకువెళుతున్నాను' అంటుంది.

కుబ్జ నిజానికి త్రివక్ర. మెడ వంకర. నడుమ వంకర. కాళ్లు వంకర. అయితే మాత్రం వెక్కిరింపుగా 'చక్కనగుచు నివ్వటిలెదు' అంటాడా! ఇదంతా పోతనగారి చమత్కారం. మూలంలో ఈ మాట లేదు

కా త్వం వరోర్వే తదుహానులేపనం, కస్యాంగనే వా కథయస్వ సాధు నః ।
దేహ్యావయో రంగవిలేప ముత్తమం, శ్రేయ స్తతస్తే న చిరాద్భవిష్యతి ॥

'ఆ విలేపనాలు మా కివ్వు. నీకు త్వరలో శుభం కలుగుతుంది' అని మూలంలో ఉంటే ఇవన్నీ మాకిస్తే నీవంకర చక్కబడి నీవు చక్కని దానవవుతావు' అంటాడు తెలుగు కృష్ణుడు. అందుకు కుబ్జకు రోషం వచ్చి పై విధంగా పలికింది. తరువాత ఆ విలేపనాన్ని రామకృష్ణులకు సమర్పిస్తుంది. కృష్ణుడు ఆమె వక్రత్వం పోగొట్టి అనుగ్రహిస్తాడు.

శ్రీకృష్ణుడు కంసుని ధనుశ్శాలలో ఉన్న విల్లు విరవటం అత్యంత మనోహరంగా వర్ణించాడు పోతన-

బంధుల్ మేలన వామహస్తమునఁ జాపం బెత్తి మౌర్వీలతా
సంధానం బొనరించి కొంచెపుఁ దెగన్ శబ్దించుచున్ ధీరతా
సింధుం డా హరి దాని ఖండితముగాఁ జేసెన్ జనుల్ చూడఁగా
గంధేభంబు రసాలదండము నొగిన్ ఖండించు చందంబునన్. 10-1283

ఈ పద్యం మూలానికి సరైన అనువాదం. గమనించండి మూలశ్లోకాన్ని-

కరేణ వామేన సలీలముద్ధృతం, సజ్యం చ కృత్వా నిమిషేణ పశ్యతామ్ ।
నృణాం వికృష్య ప్రబభంజ మధ్యతో, యథేక్షుదండం మదకర్యురుక్రమః ॥

పోతన్నగారు ఈ సందర్భంలో చేసిన చంద్రోదయ సూర్యోదయ వర్ణనలు అనన్యసామాన్యములు, అత్యంతమనోహరములు, ముందు చంద్రోదయాన్ని చిత్తగించండి-

ప్రాచీదిశాంగనా ఫాలతలంబున దీపించు సిందూరతిలక మనఁగ
దర్పించి విరహుల ధైర్యవల్లులు ద్రెంప దర్పకుం డెత్తిన దాత్ర మనఁగ
నలిగి కాలకిరాతుఁ డంధకారమృగంబు ఖండింప మెఱయించు ఖడ్గ మనఁగ
గగనతమాలవృక్షము తూర్పుకొమ్మను లలితమై మెఱయు పల్లవ మనంగఁ

దొఁగలు సంతసిల్ల దొంగలు భీతిల్ల, కడలి మిన్ను ముట్టి కడలుకొనఁగ
పొడిచె శీతకరుఁడు భూరి చకోరక, ప్రీతికరుఁడు జారభీతికరుఁడు. 10-1295

చంద్రోదయానికి ముకుళించుకొన్న కమలాలను ఎంత హృదయంగమంగా వర్ణించాడో చూడండి-

'కళలు గలుగు గాక; కమల తోడగుఁ గాక, శివుని మౌళిమీఁదఁ జేరుఁగాక;
నన్య నొల్లఁ దపనుఁడై న మత్పతి' యని, సాధ్విభంగి కమలజాతి మొగిడె. 10-1290

ఇక్కడ 'తపనుఁడు' అనటంలో చమత్కారం ఉన్నది. తపన శబ్దానికి సూర్యుడు, తపింపజేసేవాడు అని రెండర్థాలు. సాధ్వీలక్షణం సమంజసంగా నిరూపితమైంది.

ఇదే సందర్భంలో పోతన్నగారు చేసిన సూర్యోదయవర్ణనం అనంతర ప్రబంధకవులకు 'ఒజ్జబంతి' అయింది. ముద్దులు మూటగట్టే ఆ పద్యాన్ని చిత్తగించండి-

పౌలోమి తన బాలు పాన్పుపైఁ గనుపట్టఁ బన్నిన పవడంపు బంతి యనఁగ
నాయురర్థముల వ్యయంబు లొత్తిలి చాటు కాలజాంఘికుచేతి ఘంట యనఁగ

ఘనజంతుజీవిత కాలరాసుల విధి కొలువ నెత్తిన హేమకుంభ మనఁగ

పశ్చిమదిక్కాంత పరఁగఁ గైసేయుచో ముందట నిడుకొన్న ముకుర మనఁగఁ

గోకతాపోపశమ దివ్య ఘుటిక యనఁగ, పద్మినీకాంత నోముల ఫల మనంగ

'మూఁడుమూర్తుల సారంపు ముద్ద' యనఁగ, మిహిరమండల ముదయాద్రిమీఁద నొప్పె. 10-1304

ఈ వర్ణనలన్నీ పోతన్నగారి సొంతం.

మల్లయుద్ధంలో మహావీరుడైన చాణూరుడు శ్రీకృష్ణుణ్ణి అధిక్షేపించటం చాలా సహజంగా ఉన్నది.

నాతోఁ బోరఁగ నెంతవాఁడ విసిరో నా సాటియే నీవు? వి

ఖ్యాతుండం గులజుండ సద్గుణుఁడ సత్కర్మస్వభావుండ; నీ

కేతాదృగ్విభవంబు లెల్లఁ గలవే? యీ వీట పోరాడుటల్

వ్రేతల్ చూడఁగఁ గుప్పిగంతు లిడుటే వీక్షింపు గోపార్భకా! 10-1338

రణరంగంలో కూడ పోతనగారు తనకు సహజమైన అంత్యప్రాస సౌందర్యాన్ని ప్రదర్శించకుండా ఉండలేదు. జరాసంధుడు రామకృష్ణుల పైకి యుద్ధానికి వచ్చి వారిని చుట్టుముట్టినప్పుడు ఎంత చక్కని కల్పన చేశాడో చూడండి-

పవనుఁడు మేఘరేణువుల భానుకృశానులఁ గప్పుకైవడిన్

వివిధబలౌఘముం బనిచి వేగమ మాగధుఁ డావరించె భూ

మ్యవనిచరిష్ణులన్ గువిమతావనినాథ నిరాకరిష్ణులన్

దివిషదలంకరిష్ణుల నతిస్థిరజిష్ణుల రామకృష్ణులన్. 10-1554

కాలయవనుడు శ్రీకృష్ణుని వెంట పడతాడు. కృష్ణుడు పరుగిడుతూ పోయి పోయి ఒక గిరిగహ్వరంలో దూరుతాడు. కాలయవనుడు కూడా ఆ గుహలో జొరబడి నిద్రపోతున్న ముచుకుందుణ్ణి శ్రీకృష్ణునిగా భావించి కాలితో తంతాడు. ముచుకుందుని కన్నులనుండి వెలువడిన క్రోధాగ్ని జ్వాలలకు కాలయవనుడు భస్మమైపోతాడు. అనంతరం ముచుకుందుడు తనముందు సాక్షాత్కరించిన శ్రీకృష్ణుణ్ణి చూచి ఇలా అంటాడు-

శశివో! యింద్రుఁడవో! విభావసుఁడవో! చండప్రభారాశివో!

శశిచూడామణివో! పితామహుఁడవో! చక్రాంకహస్తుండవో!

దిశలున్ భూమియు మిన్ను నిండె నిదె నీ తేజంబు చూడంగ దు

ర్దశమై; యెవ్వఁడ వేల వచ్చి తిచటన్ వర్తించె దేకాకివై? 10-1647

ఇది పోతన్నగారి ప్రసన్నమధురశైలికి ఒక చిన్న ఉదాహరణం.

రుక్మిణీకల్యాణఘట్టంలో పరీక్షిన్మహారాజు శుకమహర్షితో ఇలా అంటాడు-

బ్రహ్మన్ కృష్ణకథాః పుణ్యా మాధ్వీర్లోకమలాపహాః ।
కో ను తృప్యేత శృణ్వానః శ్రుతజ్ఞో నిత్యనూతనాః ॥

వ్యాసుని మూలానికి పోతన్నగారి అనువాదం ఎంత చక్కగా ఉన్నదో చూడండి-

కల్యాణాత్మకమైన విష్ణుకథ లాకర్ణించుచున్ ముక్త వై
కల్యుం డెవ్వఁడు తృప్తుఁడౌ? నవి వినంగాఁ గ్రొత్త లౌచుండు; సా
కల్యం బేర్పడ భూసురోత్తమ! యెఱుంగం బల్కవే రుక్మిణీ
కల్యాణంబు వినంగ నాకు మదిలోఁ గౌతూహలం బయ్యెడిన్. 10-1683

అంతటితో పోతన్నగారికి తృప్తి కలుగలేదు. శ్రీకృష్ణుని కథలంటేనే ఆయన ఒళ్లు పులకించిపోతుంది. సహజపాండిత్యుడు తన సహజమైన కృష్ణభక్తిని వెంటనే ఈ కందపద్యంలో పొందుపరచకుండా ఉండలేక పోయాడు-

భూషణములు సెవులకు; బుధ, తోషణము; లనేక జన్మదురితౌఘ విని
శ్శోషణములు; మంగళతర, ఘోషణములు; గరుడగమను గుణభాషణముల్. 10-1684

రుక్మిణి అన్నగారైన రుక్మి తన చెల్లెల్ని శిశుపాలునికి ఇవ్వాలని నిర్ణయిస్తాడు. బంధువుల అభిప్రాయాన్ని త్రోసిపుచ్చుతాడు.

బంధూనా మిచ్ఛతాం దాతుం, కృష్ణాయ భగినీం నృప ।
తతో నివార్య కృష్ణద్విడ్, రుక్మీ చైద్య మమన్యత ॥

ఈ శ్లోకానికి పోతన్నగారు వ్రాసినపద్యం ఎంత హృద్యంగా ఉందో చిత్తగించండి-

బంధువు లెల్లఁ గృష్ణునకు బాలిక నిచ్చెదమంచు శేముషీ
సింధువులై విచారములు సేయఁగ వారల నడ్డపెట్టి దు
స్సంధుడు రుక్మి కృష్ణునెడఁ జాల విరోధముఁ జేసి మత్త పు
ష్పంధయవేణి నిత్తు శిశుపాలున కంచుఁ దలంచె నంధుఁడై. 10-1696

శ్రీకృష్ణుని దగ్గర కంపిన బ్రాహ్మణుని రాక ఆలస్యం కావడంతో రుక్మిణి పడుతున్న ఆవేదన, ఆందోళన పోతన్నగారు అత్యద్భుతంగా వర్ణించారు-

లగ్నం బెల్లి; వివాహముం గదిసె; నేలా రాఁడు గోవిందుఁ? డు
ద్విగ్నం బయ్యెడి మానసంబు; వినెనో వృత్తాంతమున్; బ్రాహ్మణుం

డగ్నిద్యోతనుఁ డేటికిం దడసె? నా యత్నంబు సిద్ధించునో
భగ్నంబై చనునో విరించికృత మె బ్భంగిన్ బ్రవర్తించునో? 10-1725

ఇంకా ఈ పద్యంలో ఆమె మనోవేదన ఆలకించండి-

ఘనుఁ డా భూసురుఁ డేగెనో నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో
విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో? విచ్చేసెనో? యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో తలఁపఁడో? యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో? నాభాగ్య మెట్లున్నదో? 10-1726

తానేమైనా రహస్యంగా రాయబారం పంపటం పొరపాటేమో! అందుకు కృష్ణుడు తప్పుపట్టాడేమో! అని అందోళన చెందుతున్న రుక్మిణితో ద్వారకనుండి తిరిగివచ్చిన అగ్నిద్యోతనుడు ఈ విధంగా చెప్పడంలో ఎంతో ఔచిత్యం ఉన్నది-

మెచ్చె భవద్గుణోన్నతి; కమేయధనావళు లిచ్చె నాకుఁ; దా
వచ్చె సుదర్శనాయుధుఁడు వాఁడె; సురాసురు లెల్ల నడ్డమై
వచ్చిన నైన రాక్షసవివాహమునం గొనిపోవు నిన్ను; నీ
సచ్చరితంబు భాగ్యమును సర్వము నేఁడు ఫలించెఁ గన్యకా! 10-1735

ఈ పద్యంలో 'మెచ్చె భవద్గుణోన్నతికి' అనటంలో రుక్మణి మనస్సులోని సందేహం తీరిపోయింది. 'తా వచ్చె సుదర్శనాయుధుఁడు' అనటంలో శ్రీకృష్ణుని ఆగమనవేగం అభివ్యక్త మయింది.

పోతన్నగారు భాగవతప్రారంభంలో గురుస్తుతి చేయలేదే అని కొంతమందికి అనుమానంగా ఉండేది. దానికి సమాధానం మనకు ఇక్కడ దొరుకుతుంది. రుక్మిణీ కల్యాణఘట్టంలోనే పోతన్నగారు సొంతంగా ఈ పద్యం వ్రాశారు. రాయబారిగా వచ్చిన బ్రాహ్మణుడు కృష్ణుడితో అంటాడు-

ఆ యెలనాఁగ నీకుఁ దగు; నంగనకుం దగు దీవు; మా యుపా
ధ్యాయుల యాన; పెండ్లి యగుఁ; దప్పదు; జాడ్యము లేల? నీవు నీ
తోయమువారిఁ గూడుకొని తోయరుహాననఁ దెత్తుగాని వి
చ్చేయుము; శత్రులన్ నుఱుముసేయుము; సేయుము శోభనం బిలన్. 10-1713

'మీ రిద్దరూ పరస్పరం తగిన దంపతులు. మీకు తప్పకుండా వివాహం జరిగి తీరుతుంది. మా గురువులమీద ఒట్టు' అంటాడు. అంతేకాని ఆ వేదవేత్త అయిన బ్రాహ్మణోత్తముడు వేదాల తోడనిగాని,

భగవంతుని తోడనిగాని, గాయత్రి తోడనిగాని అనకుండా ‘ మా ఉపాధ్యాయుల ఆన’ అనటంలో ఎంతో విశేషం ఉంది. ఇది పోతన్నగారికి గురువులయందుండే గౌరవానికి మచ్చుతునుక.

తన కోరిక చెల్లించి కృష్ణుని కొనితెచ్చిన బ్రాహ్మణునికి రుక్మిణీదేవి తన కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు సమర్పించడం ఎంతో సముచితంగా ఉంది.

జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి నా సందేశమున్ జెప్పి; నన్
నిలువం బెట్టితి; నీ కృపన్ బ్రదికితిన్; నీయంత పుణ్యాత్మకుల్
గలరే? దీనికి నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నే నేర; నం
జలిఁ గావించెద; భూసురాన్వయమణీ! సద్బంధుచింతామణీ! 10-1737

ఈ విధంగా పోతన్నగారి అనువాదం అత్యంతసహజంగా ఔచిత్యభరితంగా, సరసంగా, సరళంగా సాగిపోయింది.

తెలుగుజాతికి అత్యంత ప్రీతిపాత్రమైన పోతనభాగవతాన్ని అక్షరాస్యులందరికీ అందుబాటులో ఉండే నిమిత్తం హృద్యగద్యానువాద సహితంగా, ప్రతిపద్య భావార్థ సంయుతంగా ప్రకటించాలనే సముచితసంకల్పం తిరుమల తిరుపతి దేవస్థానముల వారికి కలగటం బహుధా ప్రశంసనీయం.

ఈ సందర్భంగా సంపాదించిన అనువాద భాగా లన్నింటినీ పరిశీలించి, పరిష్కరించి, వాటికి ఏక సూత్రత కల్పించే భారం నాకు అప్పగించినందులకు కార్యనిర్వహణాధికారి శ్రీ యం. వి. యస్. ప్రసాద్, ఐ.ఏ.ఎస్., మహాశయులకూ,డా. రావుల సూర్యనారాయణమూర్తి, పి.ఆర్.ఒ., గారికీ, ఎడిటర్ శ్రీ కె. సుబ్బారావు గారికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

ఈ దశమ స్కంధంలో **726** నుండి **1791** వరకు ఉన్న గద్యపద్యాలను శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులవారు సరళగద్యంలోకి అనువదించారు. వీరు సంస్కృతాంధ్ర సాహిత్య ధర్మజ్ఞులు, కవితామర్మజ్ఞులు, “విద్వత్కవి శిరోమణి” బిరుదాంకితులు, హృద్యానవద్య పద్యవిద్యా విశారదులు. ధర్మదీక్ష, అమరసందేశము, వీరమనీడు, కూనలమ్మ, నారాయణమ్మ, పూర్ణాహుతి ముక్తావళి, ప్రచండకౌశికం, వంటి అనేక కావ్యములు రచించి పేరెన్నిక గన్నవారు. అమృతసారము, బ్రహ్మగాంధర్వము, అన్నమయ్య విన్నపాలు అనే కృతులద్వారా అన్నమాచార్యులవారి అధ్యాత్మ సంకీర్తనల మధురభావ సుధారసాన్ని సుమారు తొమ్మిది వందల సీసాలకెత్తి ఆంధ్రావళికి అందించిన ధన్యజీవనులు శ్రీమాన్ ఆచార్యులవారు. వీరి రచనలపై శ్రీచల్లా హరిశ్చంద్ర పరిశోధన చేసి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి పిహెచ్. డి., పట్టం అందుకున్నారు. వీరు భాగవతమునకు కావించిన పద్యగద్యానువాదం సరసమై, సరళమై, అందరికీ అందుబాటులో ఉంది.

ఈ గ్రంథాన్ని ఇంతముచ్చటగా, ఇంత నిర్దుష్టంగా ముద్రించి ఇచ్చిన దేవస్థానం ప్రెస్ మేనేజర్ శ్రీయుతులు ఎమ్. విజయకుమార్‌రెడ్డి గారికీ, వారి సిబ్బందికీ నా సాధువాదాలు.

అక్షరదోషాలు దొర్లకుండా, సహస్రాక్షులై ప్రూఫులు సరిదిద్దిన పూజ్యమిత్రులు మహాకవి శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులవారికి, శ్రీములుకుట్ల రామకృష్ణశాస్త్రి గారికి నా అభివాదాలు.

ముద్రణకు అనుకూలంగా ప్రెస్ కాపీ సిద్ధంచేసి శుద్ధప్రతి అందించిన చిరంజీవి కోరాడ రామకృష్ణ, ఎమ్.ఎ., ఎమ్.ఫిల్., కు నా ఆశీర్వాదాలు.

కళ్యాణభారతి	భవదీయుడు
రవీంద్రనగర్,	**కరుణశ్రీ**
గుంటూరు.	ప్రధాన సంపాదకుడు
ప్రజాపతి, వసంతము.	పోతన భాగవతము